ఎమ్మెల్యే అనుచరుడు.. భూ కబ్జాదారుడు

- అక్రమంగా పట్టా చేయించుకొని భూ యజమానులకు బెదిరింపులు
- బాధితులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు

నయీంనగర్, డిసెంబర్ 9 : కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కొందరు అధికారంలో ఉన్నప్పుడే అన్నీ సమకూర్చుకోవాలి.. ఎవరు ఎటుపోతే నాకేంటి! అనేవిధంగా వ్యవహరిస్తున్నారు. ఖాళీ జాగ కనబడిందా.. కబలిస్తున్నారు. వంగపహాడ్‌లోని రింగ్‌రోడ్డు సమీపంలో ఓ వ్యక్తికి 18 గుంటల భూమి ఉంది. ఆ భూమిపై గతంలోనే గొడవలు జరగ్గా కబ్జా చేసిన వారిపై అప్పటి హసన్‌పర్తి సీఐ సురేశ్ కేసు నమోదు చేశారు. ఇటీవల ఓ ఎమ్మెల్యే అనుచరుడు ఆ భూమిని తన పేర రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. పైగా భూమి అసలు యజమానులను బెదిరిస్తుండడంతో వారు 'నమస్తే తెలంగాణ'ను సంప్రదించి తమ గోడు వెల్లబోసుకున్నారు. తమ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని తాను ఎమ్మెల్యే అనుచరుడిని అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు ఎమ్మెల్యే మొదటిసారి గెలిచాడు. ఈ క్రమంలో ఎక్కడ భూమి కనిపిస్తే అక్కడ దస్తీ వెయ్యండి.. ఏమైనా నేను చూసుకుంటా అంటూ తన ప్రత్యేక టీంకు తెలిపినట్లు సమాచారం. నగరంలో లిటిగేషన్‌లో ఉన్న భూములపై సదరు ఎమ్మెల్యే అనుచరుల కన్ను పడినట్లు తెలిసింది.

గతంలోనే అక్రమ రిజిస్ట్రేషన్

వంగపహాడ్ గ్రామానికి చెందిన చింతల అనంతయ్యకు అదే గ్రామానికి చెందిన దామెర రాజకొమురయ్య 18గుంటల భూమిని కొన్నేళ్ల క్రితం అమ్మాడు. కాగా, ఆ భూమిని రాజకొమురమ్య మనమడు ప్రశాంత్, అతడి తల్లి సౌభాగ్యతో కలిసి కొందరు కొన్ని నెలల క్రితం తమ పేర అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. సబ్‌రిజిస్ట్రార్ అంజద్‌కు పెద్ద మొత్తంలో డబ్బులు ఇవ్వగా, ఆ భూమికి ఎలాంటి పాస్‌బుక్ లేకున్నా, నాలా పర్మిషన్‌తో సంబంధం లేకున్నా వీరి పేరుపై రిజిస్ట్రేషన్ చేశాడని బాధితులు తెలిపారు. ఈ విషయాన్ని అప్పటి సీఐ సురేశ్‌కు తెలుపగా, సబ్ రిజిస్ట్రార్‌కు నోటీస్‌లు పంపినట్లు చెప్పారు. సబ్ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలని పైఅధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. కాగా, ఈ విషయంపై డీఐజీ సుభాషిణి వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు. ఇటీవల కబ్జా విషయంపై హసన్‌పర్తి పోలీసుస్టేషన్‌లో పిటిషన్ ఇవ్వగా సీఐ పట్టించుకోకపోవడంతో సీపీని కలిసి వివరించినట్లు తెలిపారు.

అందిరినీ శాసించేది అతడేనా?

అటు పోలీసు వ్యవస్థ, ఇటు రెవెన్యూ శాఖ, మరో పక్క రిజిస్ట్రేషన్ శాఖలను ఆ ఎమ్మెల్యేనే శాసిస్తున్నాడా? తమకు ఇంత అన్యాయం జరుగుతున్నా న్యాయం చేసేవారు ఎవరూ లేరా? అంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకప్పుడు కేసులు నమోదు చేసిన పోలీసులు.. ఇప్పుడు ఎందుకు పట్టించుకోవడం లేదని, తహసీల్దార్ ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.

కోర్టులో తేల్చుకోవాలి

భూ వివాదాలు ఏమైనా ఉంటే కోర్టులో తేల్చుకోవాలి. ఇద్దరూ పిటిషన్ ఇచ్చారు. ఏమైనా పేపర్స్ ఉంటే కోర్టును సంప్రదించడం మంచిది. సివిల్ కేసుల విషయంలో పోలీసులు జోక్యం చేసుకోరు.

– చేరాలు, సీఐ

సమస్యలతో వచ్చాం.. పరిష్కారం చూపండి

- గ్రీవెన్స్ సెల్‌లో ప్రజల గోడు
- వినతులు స్వీకరించిన అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

విజ్ఞప్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డి

హనుమకొండ, డిసెంబర్ 9: 'సమస్యలతో వచ్చాం.. పరిష్కారం చూపండి' అంటూ బాధితులు సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన గ్రీవెన్స్ సెల్ కార్యక్రమంలో గోడు వెళ్లబోసుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన ప్రజలు తమ సమస్యలపై అధికారులకు విన్నవించారు. బాధితులు నుంచి అదనపు కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డి, డీఆర్‌వో వైవీ గణేశ్ వినతులను స్వీకరించారు. వివిధ సమస్యలపై 88 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. వీటిలో రెవెన్యూ, జీడబ్ల్యూఎంసీకి సంబంధించిన సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. 30 తహసీల్దార్ కార్యాలయాలకు సంబంధించి రెవెన్యూ దరఖాస్తులు, 15 జీడబ్ల్యూఎంసీ, 8 ఎంపీడీవోలు, హనుమకొండ, పరకాల ఆర్‌డీవోలకు సంబంధించి 10, వ్యవసాయ, జిల్లా సంక్షేమాధికారి, ఎంజీఎం దవాఖానకు సంబంధించి నాలుగు చొప్పున రాగా, మిగతావి ఇతర శాఖలకు సంబంధించిన దరఖాస్తులు ఉన్నాయి. ప్రజావాణిలో అర్జీలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీఓలు రమేశ్‌రాథోడ్, డాక్టర్ నారాయణ, జడ్పీ సీఈవో, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు వస్తలేవు

నేను వితంతువును. కాంగ్రెస్ వాళ్లు ప్రజాపాలన పేరుతో దరఖాస్తులు స్వీకరించారు. నేను కూడా దరఖాస్తు చేసుకున్న. నా పేరు ఎక్కడా లేదని అధికారులు అంటున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో నా పేరు ఆన్‌లైన్‌లో ఎక్కలేదు. నాకు సంక్షేమ పథకాలు అందడం లేదు. పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదు. నిరుపేద వితంతువునైన నాకు న్యాయం చేయాలి.

– కే పద్మ, దర్గా కాజీపేట

రుణమాఫీ డబ్బులు ఇప్పించాలి

నేను నిరుపేద దళిత రైతును. ప్రభుత్వం నాకు రుణమాఫీ వర్తింపజేసింది. బ్యాంకు అధికారులు నా ఖాతాలో ఉన్న డబ్బులు డ్రా చేసి ఇవ్వడం లేదు. నా ఖాతాలో రూ. 1.50లక్షలు ఉన్నాయి.

– పసుల రాజేరు, నాగారం, పరకాల మండలం

తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

కేసీఆర్ పోరాటం మరువలేనిది

భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్‌భాస్కర్

హనుమకొండ, డిసెంబర్ 9 : స్వరాష్ట్ర సాధనకు మాజీ సీఎం కేసీఆర్ ఎనలేని పోరాటం చేశారని భారత జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ అన్నారు. విజయ్ దివస్ సందర్భంగా సోమవారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అనే నినాదంతో కేసీఆర్ చేసిన ఆమరణ నిరాహార దీక్షతో దిగివచ్చిన నాటి కేంద్ర ప్రభుత్వం 2009 డిసెంబర్ 9న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించిందన్నారు. కేంద్రాన్ని ఒప్పించి ఈ రోజు దీక్ష విరమించారని తెలిపారు. కేసీఆర్ దీక్ష ఫలితంగానే స్వరాష్ట్రం సాధ్యమైందన్నారు. పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, సల్వాజీ రవీందర్‌రావు, పోలపల్లి రామ్మూర్తి, రఘు పాల్గొన్నారు.

మెడికల్ షాపుల్లో అధికారుల తనిఖీలు

భారీగా పట్టుబడిన గడువు ముగిసిన మందులు

వేలేరు, డిసెంబర్ 9 : వేలేరులోని పలు మెడికల్ షాపుల్లో డ్రగ్ కంట్రోలర్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఓ మెడికల్ షాపులో భారీగా గడువు ముగిసిన మందులు లభ్యమైనట్లు తెలిసింది. వైద్యులకు ఇచ్చే శాంపిల్ మందులను గుర్తించినట్లు సమాచారం. సుమారు రూ.లక్ష విలువైన 65రకాల గడువు ముగిసిన మందులను అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా, ప్రభుత్వ అధికారులు, వైద్యుల సహకారంతోనే ఇదంతా జరుగుతున్నదని సమాచారం. గడువు ముగిసిన మందులు దొరికిన మెడికల్ షాపు యాజమానిపై కేసు నమోదు చేశారా? లేక జరిమానా విధించారా? అనేది తెలియాల్సి ఉంది. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కు కాల్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

సుబేదారి, డిసెంబర్ 9 : గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం హనుమకొండ పోలీసు స్టేషన్ పరిధి పెద్దమ్మగడ్డ–కేయూసీ రోడ్డులో జరిగినట్లు ఇన్‌స్పెక్టర్ సతీశ్ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 60 సంవత్సరాలు ఉంటుందని, ఆచూకీ తెలిసిన వారు 8712685113 సంప్రదించాలని సూచించారు.

బార్, హోటల్ నిర్వాహకులకు కౌన్సెలింగ్

మడికొండ, డిసెంబర్ 9 : బార్, రెస్టారెంట్లు, హోటల్ నిర్వాహకులకు మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రాత్రి పదిన్నర గంటల్లోపు మూసివేయాలని సూచించారు. ఎవరైనా అతిక్రమిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పరీక్షలు వాయిదా వేయాలని ఆందోళన

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 9 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో పీజీ రెండో సంవత్సరం పరీక్షలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. కేయూ పరిపాలనా భవనం ఎదుట సోమవారం బైఠాయించి ధర్నా చేశారు. వెంటనే పరీక్షలు వాయిదా వేయాలని వీసీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న కేయూ పోలీసులు అక్కడికి చేరుకుని వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. అధికారులు తమకు చదువుకోవడానికి సమయం ఇవ్వకుండా తమ ఇష్టానుసారంగా పరీక్షలు నిర్వహిస్తున్నారని, వెంటనే వాయిదా వేయాలని డిమాండ్ చేశారు.

మల్లికాంబ కేంద్రానికి ఆర్థికసాయం

హనుమకొండ, డిసెంబర్ 9 : మల్లికాంబ మనోవికాస కేంద్రానికి కిసాన్ పరివార్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, ఫౌండర్ నూనావత్ భూపాల్ నాయక్ ఆర్థికసాయం చేశారు. అంతర్జాతీయ దివ్యాంగుల వారోత్సవాల్లో భాగంగా కేంద్రంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు కిసాన్ పరివార్ లిమిటెడ్ ప్రతినిధి గార్గి బిశ్వాస్ ముఖ్య అతిథిగా హాజరై రూ.లక్ష చెక్కును సోమవారం కేంద్రం నిర్వహకురాలు బండా రామలీలకు అందించారు. అనంతరం పిల్లలు చేసిన నృత ప్రదర్శన ఆకుట్టుకున్నది. వారోత్సవాల పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు ప్రశంసాపత్రాలు అందించారు. అన్నదానం నిర్వహించారు. లోకేశ్, శివరామ్, కోడం కల్యాణ్ పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

కాజీపేట, డిసెంబర్ 9 : కాజీపేట పట్టణం ప్రశాంత్ నగర్‌లోని సహృదయ అనాథ వృద్ధాశ్రమంలో సోమవారం వంశీరెడ్డి ఫౌండేషన్ డైరెక్టర్ కంచరకుంట్ల మురళీధర్‌రెడ్డి వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వృద్ధుల భోజనం కోసం రూ.25 వేల నగదు అందజేశారు. తన కుమారుడు వంశీరెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వంశీరెడ్డి జన్మదిన వేడుకలను సహృదయ అనాథ వృద్ధాశ్రమంలో జరిపించడం ఆనందంగా ఉందన్నారు. శ్రీధర్‌రెడ్డి, వేణుయాదవ్, సోమిరెడ్డి, హరిణి, శ్రీకాంత్, మధురెడ్డి పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలపై దృష్టి పెట్టాలి

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 9 : ఉపాధ్యాయులు అభ్యసన సామర్థ్యాలపై దృష్టి పెట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి అన్నారు. హనుమకొండ లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ఉన్నత పాఠశాలలో ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల గుణాత్మక విద్య అభివృద్ధిపై అత్యంత శ్రద్ధ చూపాలన్నారు. ప్రాథమిక తరగతుల విద్యార్థులకు మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యుమరసీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో జిల్లా గుణాత్మక విద్య సమన్వయ అధికారి శ్రీనివాస్, మండల విద్యా శాఖ అధికారి నెహ్రూ, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రవికుమార్, రామారావు, రామ్‌జీ, సీఆర్పీలు ఉమారాణి, నిర్మల పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 22 మంది డిబార్

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 9 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 22 మంది మాల్ ప్రాక్టీసింగ్ కింద బుక్ అయినట్లు అదనపు పరీక్షల నియంత్రణాధికారి తిరుమలాదేవి తెలిపారు. ఇందులో ఆదిలాబాద్, ఖమ్మం పరీక్షా కేంద్రాల్లో ఐదుగురు చొప్పున, వరంగల్ పరీక్షా కేంద్రాల్లో నుంచి 12 మంది డిబార్ అయినట్లు తెలిపారు.

ఎల్ఐసీ ఏజెంట్లకు భద్రత కల్పించాలి

హనుమకొండ, డిసెంబర్ 9 : ఎల్ఐసీ ఏజెంట్లకు భద్రత కల్పించాలని ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల అధ్యక్షుడు పసంగుల రామారావు డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల పరిష్కారం కోసం భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య ఆధ్వర్యంలో సోమవారం బాలసముద్రంలోని ఎల్ఐసీ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. 60 సంవత్సరాలుగా ఎల్ఐసీ ఏజెంట్లుగా పనిచేస్తున్న తమకు పాత కమిషన్ విధానం కొనసాగించాలని, ఏజెంట్ వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు చేయాలని, ప్రీమియంపై జీఎస్టీ రద్దు చేయాలని, లోన్లపై వడ్డీ రేటు, పాలసీలపై ప్రీమియం తగ్గించాలని, అలాగే కనీస బీమాను రూ.లక్షకు తగ్గించాలని, గ్రాట్యూటీని రూ. 10లక్షలకు పెంచాలని, కుటుంబ సభ్యులు, ఏజెంట్లకు మెడిక్లెయిమ్ వర్తింపజేయాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో రావుల నారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గొర్రెల చోరీకి దుండగుల యత్నం

అడ్డుకున్న గ్రామస్తులు.. వ్యక్తికి తీవ్రగాయాలు

దామెర, డిసెంబర్ 9 : గొర్రెలను చోరీ చేసేందుకు దొంగలు యత్నించగా, అడ్డుపడిన గ్రామస్తుడిపై దుండగులు దాడిచేసి గాయపర్చిన ఘటన కోగిల్వాయిలో సోమవారం తెల్లవారు జామున జరిగింది. ఎస్సై కొంక అశోక్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జంగిలి బాబు తనకు ఉన్న గొర్రెలను ఇంటి సమీపంలో కట్టేసి చుట్టూ తడకలను ఏర్పాటు చేశాడు. గుర్తు తెలియని కారులో కొందరు అక్కడికి వచ్చి రెండు గొర్లను ఎత్తుతెళ్లి కారులో వేశారు. ఈ క్రమంలోనే బాబు అన్న రవి, బంధువుల ఇంటికి వెళ్లేందుకు రోడ్డుపైకి వస్తుండగా, గొర్రెలు అరుస్తుండడం, గుర్తు తెలియని కారు రోడ్డు పక్కన ఉండడాన్ని గుర్తించారు. వెంటనే అక్కడికి వెళ్లి ఎవరంటూ ప్రశ్నించగా, దొంగలు బండరాయితో రవిపై దాడి చేశారు. రవి అరుపులు విన్న గ్రామస్తులు అక్కడికి చేరుకోగా దొంగలు కారు అక్కడే వదిలేసి పరారయ్యారు. తీవ్రంగా గాయపడ్డ రవిని చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలి

హనుమకొండ, డిసెంబర్ 9 : గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలని జీఎంపీఎస్ జిల్లా కార్యదర్శి లింగయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పెంపకందారుల సంక్షేమానికి నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తున్నదన్నారు. అవినీతి సాకుతో రెండో విడుత గొర్రెలు పంపిణీ చేయకుండా రెండేళ్ల తర్వాత డీడీలు వాపస్ ఇచ్చారని, దీంతో గొల్లకురుమలు ఆర్థికంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజూ వందలాది గొర్రెలు మృత్యువాత పడుతున్నా ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందడం లేదన్నారు. ఖాళీగా ఉన్న పశు వైద్యాధికారులు, సిబ్బంది పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రెండేళ్లుగా ప్రభుత్వం నట్టల నివారణ మందు ఇవ్వడం లేదన్నారు. ముఖ్యంగా పశు వైద్యశాలల్లో మందులు లేవని డాక్టర్లు చెబుతున్నారన్నారు. మహబూబ్‌నగర్‌లోని దక్కన్ జాతి గొర్రెల పరిశోధనా కేంద్రాన్ని ఎత్తివేసే ప్రయత్నం జరుగుతున్నదని మండిపడ్డారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేశ్, జిల్లా సహాయ కార్యదర్శి పోటు రాజ్‌కుమార్, జిల్లా సభ్యులు గండ్రకోటి కుమార్, నల్లబట్ట చిన్నరాజు, తొట్టె భీమన్న పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, ANKALLA ANITHA (Old Name) H.No.3-160 Venkatraopalli (B), Tekumatla Mdl, Jayashankar Bhupalpally Dist-506356, T.S. Changed my name as ANKALLA VANITHA W/o ANKALLA SWAMY (New Name). for all purpose.
NTW-000

పేరు మార్పు

నేను అసలు మహేందర్ కర్ర, తండ్రి: దశరథం కర్ర, వ: 45 సంలు, వృత్తి: వ్యవసాయం, నివాసం : ఇం.నెం. 2-111, గ్రామం : ములకపల్లి, మండలం: మొగుళపల్లి, జిల్లా: జయశంకర్ భూపాలపల్లి, తెలంగాణ, పిన్: 506366. నా పూర్వపు పేరయిన మహేందర్ కర్ర వారసత్వాన్ని మార్చుకుంటున్నాను. కావున ఇప్పటి నుంచి నా పేరు కర్ర మహేందర్ రెడ్డి గా మార్చబడుచున్నది. దీని ప్రకారమే ఇక మీదట నాయొక్క రికార్డులలో మరియు లావాదేవీలలో ఈ పేరు ప్రకారమే జరుపబడును.
- కర్ర మహేందర్ రెడ్డి

SKY ASSOCIATES- WANTED

★Area collection executives, Telecallers,Experience is not required Locations: Warangal, Narsampet, Wardhannapeta, Thorrur, Parkal, Mulugu, Ghanpur,-Cont 9491465729
NTW-332306

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

WANTED

★త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. 8520980099 / 8520874499.
NT-338976-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563 9182777961

WARANGAL 9182777556

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

బంచరాయి భూములకు పట్టాలు ఇవ్వాలి

శాయంపేట: మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన దళితులు చలివాగు ప్రాజెక్టు కింద సాగు చేస్తున్న బంచరాయి భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. చలివాగు ప్రాజెక్టు ఆయకట్టు పక్కనున్న సర్వే నంబర్లు 624, 669, 699లో ఉన్న భూమి సుమారు 62 ఎకరాలను గ్రామానికి చెందిన 130 మంది దళితులకు పంపిణీ చేసినట్లు చెప్పారు. అయితే 40 ఏళ్లుగా ఆ భూమిపై తమ హక్కులు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ఆ భూములకు పట్టాలు ఇవ్వాలని విన్నవించినట్లు చెప్పారు. కొప్పుల గ్రామ రైతులు, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్, ఉపాధ్యక్షుడు రాజేందర్, మండల ప్రధాన కార్యదర్శి మామిడి రమేశ్ పాల్గొన్నారు.

బాపూజీనగర్‌లో చేపల మార్కెట్ నిర్మించాలి

బల్దియా ఎదుట మత్స్యకారుల ధర్నా

వరంగల్, డిసెంబర్ 9 : కాజీపేట బాపూజీనగర్ రోడ్డు పక్కన చేపల మార్కెట్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ మత్స్యకారులు సోమవారం బల్దియా కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా మత్స్యకారులు, మత్స్య కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొడుగు వెంకట్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా బాపూజీనగర్ రోడ్డు పక్కన అనేక కుటుంబాలు చేపలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాయన్నారు. ఎండ, వానలకు ఇబ్బందులు పడుతున్నారని, మార్కెట్ నిర్మించాలన్నారు. అనంతరం కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మత్స్యకారులు, సంఘం నాయకులు నిమ్మల విజేందర్, నీలం భానుచందర్, దువ్వ సమ్మక్క, కుక్కల రాజమణి, వరలక్ష్మి, యాట సంధ్య, ముత్తారం సమ్మక్క పాల్గొన్నారు.

రెండు రోజులు సీఎం కప్ క్రీడా పోటీలు

శాయంపేట, డిసెంబర్ 9: మండలంలో రెండు రోజుల పాటు సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఫణిచంద్ర సోమవారం తెలిపారు. శాయంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో 10, 11 తేదీల్లో మండల స్థాయి క్రీడలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 10న వాలీబాల్, కబడ్డీ, యోగ పోటీలు ఉంటాయని, 11న ఖోఖో, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహిస్తారన్నారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

కాజీపేట, డిసెంబర్ 9 : కాజీపేటలో పోలీసులు తనిఖీలు నిర్వహించి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను శనివారం పట్టుకున్నారు. ఆకేరు వాగు నుంచి ఇసుకను నగరానికి కాజీపేట మీదుగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను ఎస్సై లవన్‌కుమార్ సీజ్ చేశారు. ట్రాక్టర్ యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

15, 16 తేదీల్లో గ్రూప్ -2 పరీక్షలు

హనుమకొండ, డిసెంబర్ 9 : ఈ నెల 15,16వ తేదీల్లో గ్రూప్ –2 పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 82 పరీక్షా కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయన్నారు. గంట ముందు నుంచే పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. గేట్స్ మూసి వేసిన తర్వాత ఎవరినీ అనుమతించరన్నారు. అభ్యర్థులు ఈ నెల 9వ తేదీ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోనేందుకు సైట్ అందుబాటులో ఉంటుందని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కాజీపేట, డిసెంబర్ 9 : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని షెడ్యూల్డ్ కులాల హక్కుల అభివృద్ధి సమితి కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు యమడాల హనుకాంత్ అన్నారు. కాజీపేట 47వ డివిజన్‌లోని రైల్వే ఈఎల్ఎస్ కాలనీలో మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కుట్టు మిషన్ ట్రైనర్ ఎలుక సుగుణ, ఎస్సీఆర్‌డీసీ రాష్ట్ర కార్యదర్శి మునిగాల నీలిమ, యశోద, రాధ, సరిత, ఝాన్సీ, సుష్మా, ప్రేమ పాల్గొన్నారు.

పన్నులు వంద శాతం వసూలు చేయాలి

మేయర్ గుండు సుధారాణి

పన్నుల వసూళ్ల పురోగతిపై సమీక్షిస్తున్న మేయర్ గుండు సుధారాణి

వరంగల్, డిసెంబర్ 9 : గ్రేటర్ కార్పొరేషన్‌లో వంద శాతం ఆస్తి, నీటి పన్నుల సేకరణ జరగాలని మేయర్ గుండు సుధారాణి అన్నారు. సోమవారం ఆమె కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడేతో కలిసి కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో పన్నుల వసూళ్లు, భువన్ యాప్ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.113 కోట్ల పన్నుల వసూళ్లకు గాను, ఇప్పటి వరకు కేవలం రూ.40కోట్లు వసూలు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మరో 15 రోజుల్లో 60 శాతానికి చేరుకోవాలని ఆదేశించారు. గ్రేటర్‌లో మ్యుటేషన్ అయిన కొత్త గృహాలను గుర్తించి పన్నులు మదింపు చేయాలన్నారు. రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, ప్రజారోగ్య విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ రెసిడెన్షీ అనుమతులు పొంది కమర్షియల్‌గా వినియోగిస్తున్న గృహాలను గుర్తించి వెంటనే కమర్షియల్ పన్ను వేయాలన్నారు. గ్రేటర్ వ్యాప్తంగా 100 ఫీట్ల రోడ్లలో ఉన్న భవనాల పర్మిషన్లు, డీవియేషన్లు, రెసిడెన్షియల్, కమర్షియల్ వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. భువన్ యాప్‌లో గృహాల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, ఇన్‌చార్జి సిటీప్లానర్ రవీంద్ర రాధేకర్, డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, ప్రసన్నరాణి, ఐటీ మేనేజర్ రమేశ్ పాల్గ